'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పోస్టర్ ఆవిష్కరణ



పటాన్‌చెరు టౌన్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఓ వరమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు రూ.10లక్షల వైద్యసహాయం అందిస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా 1,672 రకాల వ్యాధులకు వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యువరాజ్, రతన్‌సింగ్, రాజు, సాయిన్న తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఆలిండియా క్రాఫ్ట్ మేళా

- శిల్పారామంలో 500 స్టాల్స్ ఏర్పాటు, ఫుడ్ కోర్టులు సైతం..
- ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈనెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆలిండియా క్రాఫ్ట్ మేళా ప్రారంభం కానుంది. భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, నేషనల్ జ్యూట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న మేళాకు దేశం నలుమూలల నుంచి చేనేత, హస్త కళాకారులు రానున్నారు. దాదాపు 500ల స్టాల్స్‌ను ప్రత్యేకమైన గడ్డితో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలో చెక్కబొమ్మలు, విగ్రహాలు, జ్యూట్ బ్యాగులు, బొమ్మలు, ఆర్టిఫీషియల్ జువెలరీ, టెర్రకోట, వెదురు ఫర్నిచర్‌తో పాటు వివిధ రకాల ఉత్పత్తులను నగరవాసులకు అందుబాటులో ఉంచనున్నారు. సాంప్రదాయ చీరలు, మధుబని, పెయింటింగ్ చీరలు, యువతను ఆకట్టుకునే వస్త్రాభరణాలు అందుబాటులో ఉండనున్నాయి.



శిల్పారామంలో స్టాల్స్ ఏర్పాట్లు



ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు

మేళాలో భాగంగా సందర్శకులను ఆకట్టుకునేందుకు శిల్పారామం ఆంఫీ థియేటర్‌లో ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, సంగీత కచేరీలు జరుగుతాయి.

ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు..

ప్రతి రోజు ఉ.10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. స్టాల్స్‌లో ఉత్పత్తులను కొంటే డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారికి డిస్కౌంట్ ఉంటుందన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ కోర్టులు



హ్యాండ్‌లూమ్ , నేషనల్ జ్యూట్ బోర్డు, హ్యాండ్‌క్రాఫ్ట్స్ మొత్తం 500 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు వసతులను ఏర్పాటు చేస్తున్నాము. ఫుడ్ కోర్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. చిన్నారులకు ఆటస్థలాలు, సందర్శకులు ఉత్సాహంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాము.

–శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య

మంత్రులను కలిసిన సగర సంఘం నాయకులు



మంత్రి సీతక్కను సన్మానించిన నాయకులు

గచ్చిబౌలి: కొత్తగా కొలువుదీరిన మంత్రులను రాష్ట్ర సగర సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రులను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులను సంఘం నాయకులు కలిశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సత్యం, కుమారస్వామి, కేపీరామ్, స్రవంతి, రవి,వెంకటస్వామి, రాము, సాయిగణేష్, సీతారామ్, రమేష్, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

13న నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 13న పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుండి చేపడుతున్న పనుల పురోగతి నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల రూపకల్పనపై చర్చించనున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని ఆయన తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పథకాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, కార్పొరేటర్లు



ఉచిత టికెట్‌ను చూపుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకాలను ఆదివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌లు ప్రారంభించారు. కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్‌పటేల్, వి.జగదీశ్వర్‌గౌడ్, గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సృజన, మెడికల్ ఆఫీసర్ చందర్, హెసీయూ డిపో మేనేజర్ మురళీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: మహాలక్ష్మి పథకాన్ని ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేసే పథకాలు, కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఆర్డీఏపీడీ శ్రీనివాసరావు, ఆసుపత్రి ముఖ్య అధికారి వసుంధర, ఎంపీపీలు సుష్మా శ్రీ,ప్రవీణ, జెడ్పీటీసిలు సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు తుమ్మల పాండురంగారెడ్డి, రోజా బాల్‌రెడ్డి , లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, రాములుగౌడ్, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, మెట్టుకుమార్ యాదవ్, పుష్ప నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 45 , బెండ 60, కాకర 40, దొండ 50, దోస 40, ఆలు 25, చామ 60, కీర 25, బీర 70, వంకాయ 40, గోకర 55, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 40, క్యాబేజీ 20, క్యారెట్ 55, చిక్కుడు 60, ఉల్లి 60 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 300, వెల్లుల్లి 300.

ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు ప్రణీత్ పనోరమ కాలనీలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో 100 కోట్ల రూపాయలతో ఇప్పటికే ఐదు రిజర్వాయర్లను నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్,వార్డు కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కృష్ణ, సర్పంచ్ కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన

మియాపూర్: ప్రాపర్టీ కొనుగోలు ఒప్పందంలో ఉన్న అన్ని సౌకర్యాలను తమకు కల్పించాలని దివ్యశ్రీ శక్తి అపార్ట్‌మెంట్ ఓనర్స్ కో- ఆపరేటివ్ మెయింటెనెన్స్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఒప్పందం ప్రకారం బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మించకుండా ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా తమ ఆధీనంలోఉన్న స్థలాన్ని సైతం ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ సొసైటీ సభ్యులు ఆదివారం ఆందోళన చేశారు. సొసైటీ సభ్యుల కథనం ప్రకారం.. మియాపూర్ మయూరీనగర్‌లో దివ్యశ్రీ శక్తి అపార్ట్‌మెంట్స్‌ను 2010లో నిర్మించారు. 10 ఏళ్లు గడుస్తున్నా క్లబ్ హౌస్ నిర్మించకపోగా కొంత కమర్షియల్ స్థలాన్ని ఆక్రమించారని సొసైటీ సభ్యులు ఆరోపించారు. అపార్ట్‌మెంట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం జ్యోతి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, జతిస్వరం, రామాయణశబ్దం, తారంగం, కీర్తనలు, దరువు, భామాకలాపం తదితర అంశాలను కళాకారులు నేపథ్య, లోహిత, వర్షిణీ, ధృతి, లక్షిత, అమూల్య , అక్షయ ప్రదర్శించారు.

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు



గాంధీని సన్మానిస్తున్న కాలనీల నాయకులు, మహిళలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల, హుడా కాలనీ, నవోదయ కాలనీ, సాయినగర్, సైబర్ ఎన్క్లేవ్, శ్రీకృష్ణ కాలనీ, ఖాజాగూడ హరిజన బస్తీ, రాయదుర్గం హరిజన యూత్ సభ్యులు, గోపన్‌పల్లి ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలవాసులు, బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సగర మహిళా సంఘం జగద్గిరిగుట్ట అధ్యక్షులు తిరుపతమ్మ, ప్రధాన కార్యదర్శి శాంత సుమ సగర, మంజుల సగర, సాగర్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ రోజాదేవి

పరిశోధనలో ప్రతిపాదనలు శాస్త్రీయంగా ఉండాలి

రాయదుర్గం: పరిశోధనలో ఊహా ప్రతిపాదన శాస్త్రీయంగా ఉండాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగం కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా పిఆర్‌ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ కళాశాల తెలుగు పరిశోధన కేంద్రం, డికె ప్రభుత్వ మహిళా కళాశాల నెల్లూరు ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనా విధానం రెండు రోజుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశోధన ప్రణాళికలో ఊహ ప్రతిపాదన సూటిగా, స్పష్టంగా వివరణాత్మకంగా ఉండాలని చెప్పారు. సిద్ధాంత వ్యాస రూపకల్పన ఆకారాలు అనే అంశంపై వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మేడిపల్లి రవికుమార్ ప్రసంగించారు. అనంతరం పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వివరణతో తెలుగు పరిశోధన పద్ధతులపై లోతైన చర్చ సాగింది. కార్యక్రమంలో డాక్టర్ కరుణశ్రీ,, డా.పద్మప్రియ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో మహిళలకు అధిక ప్రాధాన్యత



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్‌టీసీ బస్ ఉచిత ప్రయాణంపై మహిళలందరు చాలా సంతోషంగా ఉన్నారన్నారు.రాబోయే రోజుల్లో మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, ఏకాంత్‌గౌడ్, శ్రీహరిగౌడ్, యువజన నాయకులు రాజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

- రామలింగేశ్వర దేవస్థానంలో 108 కలశాలతో పూజ
- ఉమామహేశ్వరాలయంలో భస్మాభిషేకం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, జెపి కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారంను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.రామలింగేశ్వర దేవస్థానంలో 108 కలశాల పూజ, అన్నదానం జరుగుతుందని ఆలయ అర్చకుడు మహేష్ తెలిపారు.అదేవిధంగా జె.పి కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో భస్మాభిషేకం జరుగుతుందని తెలిపారు.

అద్దె మైదానాల్లో ఆటలు

ఈ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. వీటిని ఏర్పాటు చేస్తామని నాయకులు ప్రతి సారీ హామీలు ఇవ్వడమే గానీ ఆచరణలోకి వచ్చేసరికి విస్మరించడం సాధారణమైంది. అనేక మంది క్రీడాకారులు దూర ప్రాంతాలకు వెళ్లి ఆడుకోవడం, ప్రాక్టీసు చేస్తున్నారు. కొందరైతే మైదానాలను అద్దెకు తీసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇది రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పరిస్థితి.



ఓ పాఠశాల మైదానంలో ఆడుకుంటున్న యువకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం , తెల్లాపూర్ యువత సుమారు 20 ఏళ్లుగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని నేతలను కోరుతున్నారు. పదేళ్లకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెల్లాపూర్ పరిధిలో క్రీడా మైదానం కోసం నాటి ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి స్థలాన్ని సైతం పరిశీలించారు. ఈ సమయంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రభుత్వం సైతం మారింది. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. క్రీడా మైదానం కోసం చూసిన ప్రాంతాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఫంక్షన్ హాల్, మున్సిపల్ కార్యాలయానికి కేటాయించింది. ఈ పనులు జరుగుతున్నాయి. కానీ క్రీడా మైదానం మాత్రం రాకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. సెలవు దినాల్లో యువకులు భెల్ కాలనీలోని పాఠశాల క్రీడా మైదానాలలో ఆటలు ఆడుకుంటున్నారు. అలాగే గ్రామ ప్రాంతాల్లో చెట్లల్లో, పుట్టల్లో ఆడుతున్నారు. గతంలో భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీను ఆనుకొని బీహెచ్ఈఎల్ పరిశ్రమకు చెందిన ఖాళీ స్థలంలో యువత వాకింగ్, క్రీడలు ఆడేవారు. యాజమాన్యం ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి ఆ ప్రాంతంలోకి ఎవరూ రాకుండా ఫెన్సింగ్ వేసింది. దీంతో క్రీడాకారులు ఇతర ప్రాంతంలోని క్రీడా మైదానాలను అద్దెకు తీసుకొని ఆడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్థలం కేటాయించాలి



సరైన క్రీడా మైదానాలు లేక ఆటగాళ్లు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆటస్థలాన్ని కేటాయించాలి. అలాగే దానిని అభివృద్ధి చేయాలి.

– సురేశ్, తెల్లాపూర్

దూర ప్రాంతాలకు వెళ్తున్నాం



స్థానికంగా క్రీడా మైదానాలు లేవు. భారతీనగర్ శివారు ప్రాంతంలోని క్రీడా మైదానాలను అద్దెకు తీసుకున్నాం. ఇక్కడే ఆడుకోవాల్సిన పరిస్థితి. రామచంద్రాపురం పరిధిలో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తే అందరికీ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– అంజాద్, భారతీనగర్ డివిజన్

సనాతన సంప్రదాయాలను కాపాడాలి

భాగ్యనగర్‌కాలనీ: సనాతన సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని పలువురు సంఘ పెద్దలు పిలుపునిచ్చారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యానగర్ కమ్యూనిటీహాలులో ఆదివారం తృతీయ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శంకర్, నర్సింహారావు, సుధాకర్‌ల నేతృత్వంలో చేపట్టిన ఈ సమారాధన కార్యక్రమంలో హైదర్‌నగర్, ప్రగతినగర్, ఆదిత్యనగర్, సమతనగర్, తులసీనగర్, శ్రీనివాసనగర్, మియాపూర్, చందానగర్ సహా పరిసర ప్రాంతాల నుంచి వెయ్యి మందికి పైగా బ్రాహ్మణ కుటుంబాలు హాజరయ్యాయి. ప్రముఖ చలన చిత్ర నటులు కృష్ణమూర్తి, కేదారి శంకర్, సారిపల్లి సతీష్, సుజాత, లక్ష్మీ కళ్యాణి, సునీతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలు కుటుంబాల మధ్య సమిష్టి తత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. బీఎస్ఎస్ఎస్ చైర్మన్ చకిలం సుధాకర్, వెస్ట్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవ, రమేష్, కామాక్షి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కరుణాకర్, భువనేశ్వరి, విజయ, వెంకటరమణి, కళ్యాణి, రాయప్రోలు రాఘవశర్మ పాల్గొన్నారు.



ఆదిత్యానగర్‌లో జరిగిన బ్రాహ్మణ సంఘం వన భోజన సమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణ కుటుంబాల సభ్యులు

సందడిగా శిల్పారామం



మాదాపూర్: ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు శిల్పారామాన్ని అధిక సంఖ్యలో సందర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ప్రతి రోజు 2వేల మంది సందర్శించే వారని, సెలవు రోజుల్లో, శని, ఆదివారాలలో 6వేల నుండి 8వేల వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న 'చండాలిక'



హఫీజ్‌పేట్: చండాలిక నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం గచ్చిబౌలిలోని రంగ్‌భూమిలో అక్షిధ సమర్పణలో నిర్వహించిన నృత్యరూపకం సందేశాత్మంగా సాగింది. రంగ్‌భూమి ఆడిటోరియం వేదికగా ప్రముఖ నృత్యకారిణి నియంత్రికరెడ్డి సారథ్యంలో తన 40 మంది శిష్యబృందం అద్భుతంగా లయబద్ధంగా చక్కని అభినయం, హావభావాలతో ఆవిష్కరించిన రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నర్తకి సబిత భమిడిపాటి, ఆచార్య సాంబశివరావు, ప్రొఫెసర్ అరుణ భిక్కు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కొలన్ హన్మంతరెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ని సత్కరించారు.